క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

తుని రూరల్: తుని మండలం రాజుపేటలో బుధవారం రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఉదయం 10.30కు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తారని, ఆ తర్వాత గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. 11.30 గంటలకు లోవ దేవస్థానంలో మూడు వాటర్ ట్యాంకులను ప్రారంభించి, రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

కోటనందూరు: మండలంలో మంత్రి దాడిశెట్టి రాజా బుధవారం పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు మంగళవారం తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు బిళ్లనందూరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే భవనాలను ప్రారంభిస్తారన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

పంచ హారతుల సమర్పణ



ఎస్.అన్నవరంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామికి పంచ హారతులు ఇస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామివారికి భక్తులు పంచ హారతులు సమర్పించారు. మంగళవారం స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకుని విశేష పాశుర విన్నప కార్యక్రమంలో భక్తులు స్వయంగా పంచ హారతులిచ్చారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

తుని: ప్రయాణికుల సమస్యలను తెలుసుకునేందుకు బుధవారం ఉదయం 11 గంటల నుంచి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డీఎం ఎన్.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. తుని, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను 73827 81490 నంబరుకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై ధర్నా

ఏలేశ్వరం: ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్– 2022ను రద్దు చేయాలని కోరుతూ పట్టణంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ నాయకుడు బుగతా శివ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులకు మాత్రమే ఉపయోగపడేలా ఉన్న ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో జైభీమ్ భారత్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దాడిశెట్టి వీరబాబు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అన్న సమారాధన

జగ్గంపేట: ధన సత్తెమ్మతల్లి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్న సమారాధన జరిగింది. పెయింటింగ్ షాపు నిర్వాహకుడు తాళిన విజయ్, అతడి కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో స్థానిక టవర్ కాలనీ సమీపంలో ఉన్న ఆలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, అనంతరం అన్న ప్రసాదాలు స్వీకరించారు. ప్రతి మంగళవారం అన్న సమారాధన జరుపుతున్నట్టు కమిటీ సభ్యులు వైబోగుల కొండబాబు, సిమ్మ ముత్యాలు, కొప్పు అర్జున్, పాలిక వీరబాబు తెలిపారు.

ఇంటింటికీ పింఛన్ల పంపిణీ



తూర్పు లక్ష్మీపురంలో పింఛను అందజేస్తున్న మాజీ సర్పంచ్ సత్యవతి

ఏలేశ్వరం: వైఎస్సార్ పింఛన్ల కానుకలో భాగంగా ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛను సొమ్ము పంపిణీ చేస్తున్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలో మంగళవారం వైఎస్సార్ సీపీ నేత, మాజీ సర్పంచ్ ఇజనగిరి సత్యవతి పింఛన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు రోజుల తరబడి ఎదురు చూసేవారన్నారు. ప్రస్తుతం ఇంటి వద్దకే పింఛను అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో నాయకుడు గారా చినబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పింఛన్ల పంపిణీ



శంఖవరం మండలం జి.కొత్తపల్లిలో పింఛను ఇస్తున్న సర్పంచ్ ఈగల విజయదుర్గ

శంఖవరం: మండలంలో పింఛన్ల పంపిణీ చురుగ్గా సాగుతోంది. వివిధ గ్రామాల్లో పాత పింఛన్లతో పాటు నూతనంగా మంజూరైన వాటిని మంగళవారం ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, వలంటీర్లతో కలిసి పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలో మంగళవారం జోరుగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నూతనంగా 136 పింఛన్లు మంజూరయ్యాయి.

ప్రతి మాట నిలబెట్టుకున్న జగన్

- మాజీ మంత్రి తోట నరసింహం
- జగ్గంపేటలో ప్రజా సంకల్ప యాత్ర సంబరాలు



తోట నరసింహానికి కేక్ తినిపిస్తున్న రఘురాం

జగ్గంపేట: ప్రజా క్షేత్రంలో ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని, ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ ఆయన నెరవేర్చారని మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జగ్గంపేటలో పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథి తోట నరసింహం ముందుగా స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెపల్లెనూ చైతన్య పరుస్తూ 3,648 కి.మీ. పాదయాత్ర నిర్వహించి, పేదలు, అన్ని వర్గాల ప్రజల సమస్యలను ఆలకించారని చెప్పారు. అందుకనుగుణంగా నవరత్నాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా, కరోనా వెంటాడినా, ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను నెరవేర్చారని వివరించారు. ఆయా పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ మేలు జరిగిందని, ప్రతి ఒక్కరూ దీన్ని గమనించాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేయడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, యువనేత తోట రాంజీ, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, పార్టీ సీనియర్ నేతలు అత్తులూరి సాయిబాబు, జగాల్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్ల సంబరాలు

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. మంగళవారం స్థానిక శ్రీరామాసెంటర్‌లోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, తుని పట్టణ యువత అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరుపుల ఆధ్వర్యంలో..

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో లింగంపర్తిలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు జగనన్న చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రకు అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. రికార్డు స్థాయిలో 341 రోజుల పాటు, 3,648 కి.మీ. పాదయాత్ర చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, వరుపుల రాజబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహాలకు నివాళులు

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ శ్రేణులు పట్టణంలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. పార్టీ నాయకుడు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తుని శ్రీరామా సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



లింగంపర్తిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వరుపుల సుబ్బారావు



ఏలేశ్వరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

ప్రజా మద్దతుతో రెండోసారి విజయం

వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం



గోకవరంలో పార్టీ నాయకులతో పర్యటిస్తున్న తోట నరసింహం

గోకవరం: ప్రజా మద్దతుతో రానున్న ఎన్నికల్లో రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఘన విజయం సాధిస్తారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంగళవారం సాయంత్రం తొలిసారి గోకవరంలో ఆయన పర్యటించారు. స్థానిక దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రముఖ వ్యాపారవేత్త అక్షింతల రాజా ఇంటికి వెళ్లి, రానున్న ఎన్నికల్లో తనకు మద్దతివ్వాలని అభ్యర్థించారు. అనారోగ్యానికి గురైన జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ భర్త, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్‌ను, వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్ కుమారుడు గణేష్‌ను పరామర్శించారు. కృష్ణునిపాలెం పంచాయతీలోని ఆర్అండ్ఆర్ కాలనీలో వైఎస్సార్ సీపీ నాయకుడు నందూరి గంగాధర్ ఇంటికి వెళ్లి, పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. ఆయన వెంట తోట నరసింహం తనయుడు రాంజీతో పాటు నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌ఛార్జి గుల్లా ఏడుకొండలు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, దాసరి చినబాబు, సమ్మెటి మోహన్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ తదితరులున్నారు.

క్రైస్తవుల సంక్షేమానికి ప్రత్యేక కృషి

మాజీ మంత్రి తోట నరసింహం



తోట నరసింహంను సత్కరించిన పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

జగ్గంపేట: రాష్ట్రంలోని క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనీ, పాస్టర్లకు గౌరవవేతనం ఇస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. జగ్గంపేటలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దైవ సేవకుల కూడికలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని మతాలు, కులాల వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయడంలో క్రైస్తవులు ముఖ్య భూమిక పోషించాలని కోరారు. జగ్గంపేటలో పాస్టర్లకు ఇళ్ల స్థలాల మంజూరు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కె.జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీని ఘనంగా సత్కరించారు. పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇంచార్జి గుల్లా ఏడుకొండలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరిక



లింగంపర్తిలో పార్టీలో చేరిన వారితో వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలోకి వంద కుటుంబాల నుంచి భారీగా చేరారు. లింగంపర్తిలోని వరుపుల ఇంటి వద్ద ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన ఈగల వీరాంజనేయులు, మంతిన జగత్, దేవర విజయ్, మాజీ ఎంపీటీసీ సూకరాజు, ఉప సర్పంచ్ మోడెం చెల్లారావుతో పాటు వంద కుటుంబాలకు చెందిన వారికి కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన మెచ్చి తామంతా పార్టీలోకి చేరుతున్నామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వరుపుల సూరిబాబు, బెహరా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా..

- రూ.32 కోట్లతో మిగులు బడ్జెట్‌కు ఆమోదం
- మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ తీర్మానం

తొండంగి: గ్రామాల్లో అభివృద్ధి, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ పాలన సాగుతోందని వైస్ ఎంపీపీ నాగం గంగబాబు అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం జరిగింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సవరణ బడ్జెట్, 2024–25కు అంచనా బడ్జెట్‌కు పన్నులు, సీనరేజీ తదితర గ్రాంట్ల ద్వారా వచ్చే ఆదాయం, వివిధ అభివృద్ధి పనులకు శాఖల వారీగా నిధుల కేటాయింపు తదితర అంశాలను ఎంపీడీఓ పసపులేటి సతీష్ వివరించారు. అభివృద్ధి పనులకు 23 శాతం నిధులు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి 15 శాతం, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధికి 6, స్త్రీ, శిశు సంక్షేమాభివృద్ధికి 15, మంచినీటి సౌకర్యాలకు 12, విద్య, వైద్య, వ్యవసాయ, పశు గణాభివృద్ధికి 10, అత్యవసర కంటింజెంట్‌కు నాలుగు, కార్యాలయ నిర్వహణకు 15 శాతం చొప్పున నిధులు కేటాయించారు. మొత్తం ఆదాయం రూ.32.22 కోట్లు, వ్యయం రూ.32.19 కోట్లుగా రూ.73.6 వేల మిగులు బడ్జెట్‌గా ప్రతిపాదించగా, సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ప్రజాప్రతినిధులు పలు అంశాలు, సమస్యలపై చర్చించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, వైస్ ఎంపీపీ–2 యాదాల రమణ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ దూళ్లిపూడి ఆంజనేయులు, దడాల విజయబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



బడ్జెట్‌పై జరుగుతున్న తొండంగి మండల పరిషత్ సమావేశం

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం



పెద శంకర్లపూడిలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పింఛనుదారులు

ప్రత్తిపాడు: పెదశంకర్లపూడి గ్రామంలో మంగళవారం వైఎస్సార్ పింఛను కానుకతో అవ్వాతాతలను ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణ చంద్రప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం జరిగింది. అన్నవరం ట్రస్ట్ బోర్డు సభ్యుడు దోశీ చిట్టిబాబు ఆధ్వర్యంలో పింఛను లబ్ధిదారులు క్షీరాభిషేకం చేసి, కృతజ్ఞతలు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పింఛనును రూ.3 వేలకు పెంచారని, సీఎం వెంటే తామంతా ఉంటామని లబ్ధిదారులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దోశీ చిట్టికుమారి, మాజీ సర్పంచ్‌లు దోశీ తమ్మారావు (నల్లబాబు), కోట పద్దరాజుతో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భర్త వేధింపులపై ఫిర్యాదు

రౌతులపూడి: కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని రాజవరానికి చెందిన మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మద్యానికి బానిసైన భర్త తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు.

సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: ఎస్.పైడిపాలలో సారా విక్రయిస్తున్న పోలోజు శ్రీను మంగళవారం పోలీసులకు పట్టుబడ్డాడు. అతని వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై అబ్దుల్ నబీ తెలిపారు.

వైద్య శిబిరాన్ని పరిశీలించిన డీఎంహెచ్ఓ



తొండంగి మండలం ఎ.కొత్తపల్లిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ



కేపీ అగ్రహారంలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాసు

తొండంగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎ.కొత్తపల్లిలో డీఎంహెచ్ఓ డాక్టర్ నరసింహ నాయక్ మంగళవారం పరిశీలించారు. ఏవీ నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించి, సిబ్బంది సూచనలు చేశారు. రోగులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 406 మంది రోగులను పరీక్షించి, 92 రకాల మందులను ఉచితంగా అందజేశారు. 234 మందికి రక్త పరీక్షలు చేశారు. ఏవీ నగరం, తొండంగి, రావికంపాడు, కె.పెరుమాళ్లపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.రవికుమార్, డి.శిరీష, కె.అర్చన, కోసూరు రవి, వైద్యులు, పి.భారతి, వి.యువకిషోర్, ఆర్ లలితకుమారి, ఎస్.సాయిశ్రీవల్లి తదితరులు సేవలందించారు.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం

కోటనందూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. కేఓ అగ్రహారంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ వైద్యాన్ని సగటు పేదవాడి ఇంటికే తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సర్పంచ్ సారిక దేవుడు, కో–ఆప్షన్ సభ్యుడు జిగటాల కోటసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మరేగులలో ..

రౌతులపూడి: మండలంలోని గుమ్మరేగులలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ రాపర్తి రామకృష్ణ ప్రారంభించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



మెట్టుచింతలో ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న శంకర్ నాయక్

ప్రత్తిపాడు రూరల్: గిరిజనులను ఇళ్ల నుంచి దౌర్జన్యంగా ఖాళీ చేయించిన భూ ఆక్రమణదారులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి విజయశాంతి, మండల అధికారులతో కలిసి బురదకోట పంచాయతీలోని మెట్టుచింత, గిరిజనాపురం గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుని, మండల అధికారుల సమక్షంలో సమీక్షించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, కుల ధ్రువీకరణ మంజూరులో సమస్యలతో పాటు ఎస్టీ సబ్ ప్లాన్ ఏరియాలోని గిరిజన గ్రామాలను రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోకి తేవాలని స్థానికులు ఆయనను కోరారు. గిరిజనాపురంలో తమ కుటుంబం సాగులో ఉన్న 9.30 ఎకరాల భూమి, ఇళ్లను గిరిజనేతరులు దౌర్జన్యంగా ఖాళీ చేయించారని బాధిత గిరిజనులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సమగ్ర విచారణకు శంకర్‌నాయక్ ఆదేశించారు. అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు,, ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించిన వారిపై పోలీసు ఫిర్యాదు చేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. గిరిజనాపురంలో ఆయన రాత్రి బస చేశారు.

టీచర్ శ్రీవాణికి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారం



పురస్కారంతో టీచర్ శ్రీవాణి

గండేపల్లి: తాళ్లూరు జెడ్పీ హైస్కూల్ టీచర్ ఆకెళ్ల శ్రీవాణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారాన్ని అందుకున్నారు. కాకినాడలో కాపు ఉద్యోగ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన సావిత్రీబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఆమె పురస్కారం అందుకున్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

రౌతులపూడి: కేంద్ర పథకాలపై అవగాహన కల్పించేందుకు ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు మంగళవారం ఎస్.పైడిపాల, ఎ.మల్లవరం గ్రామాల్లో జరిగాయి. వివిధ వర్గాల ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను అందిస్తోందని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జిగిరెడ్డి సత్తిబాబు, రాయి ప్రసాద్, అచ్చింత సాంబ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికాంశాలపై అవగాహన ఉండాలి

తొండంగి: సమాజంలో ప్రతిఒక్కరికీ ఆర్థికాంశాలపై అవగాహన అవసరమని ఎస్‌బీఐ మేనేజర్ ఎస్.మృదుల అన్నారు. మంగళవారం గోపాలపట్నం గ్రామ సచివాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు జరిగింది. బ్యాంకులో ఆర్థిక లావాదేవీలు, డిజిటల్ మనీ ట్రాన్స్‌ఫర్, వృద్ధులకు ఆర్థిక సేవలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కళాకారుడు చిన్నారావు కళాజాత ప్రదర్శన ఇచ్చారు.

నిర్మాణాలను వేగవంతం చేయండి

కోటనందూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల వేగం పెంచేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని పెద్దాపురం డివిజన్ హౌసింగ్ ఈఈ కేవీఆర్‌కే గుప్తా సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కోటనందూరు, కాకరాపల్లి గ్రామాల జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కాలనీల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట డీఈ శ్రీనివాస్, ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

రౌతులపూడి: వైద్య పరీక్షల కోసం స్థానిక సీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు వైద్యాధికారిణి డా.జానకీదేవీ, డా.సునీత మంగళవారం సేవలందించారు. శంఖవరం గ్రామానికి చెందిన ఆకొండి సూర్యప్రకాశరావు ఆర్థిక సహకారంతో గర్భిణులకు భోజనాలు సమకూర్చారు. ఈ సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, బల్రే రాజేశ్వరరావు, జట్లా రాజా తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోష్ వేడుకలు



పిరమిడ్ ఆకారంలో విద్యార్థుల యోగా ప్రదర్శన

తుని: ఉత్సాహభరితంగా శ్రీప్రకాష్ విద్యాసంస్థల 47వ వార్షికోత్సవ జోష్ వేడుకలు జరిగాయి. మంగళవారం పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యాసౌధంలో జరిగిన సంక్రాంతి సంబరాలు అలరించాయి. సంస్థ అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా బీఎస్‌సీపీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కిమ్స్ మాజీ చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య , ప్రత్యేక అతిథులుగా బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సీఈఓ కూరపాటి కృష్ణయ్య, ఏపీ ప్రభుత్వ మాజీ ప్రత్యేక కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, సెకోటెక్ చైర్మన్ కొడాలి కేశవరావు, అడ్వాన్స్ మైనింగ్ టెక్నాలజీస్ ఎండీ నాదేళ్ల వెంకట సుబ్బారావు, ప్రతాప్ ఇండస్ట్రీస్ అధినేత వైవీఎస్ చలపతిరావు హాజరయ్యారు. ఎన్‌సీసీ క్యాడెట్లు గౌరవవందనం సమర్పించారు. విద్యార్థులు సాంస్కృతిక, క్రీడా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జాతీయ స్థాయి పోటీలు, పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆరోగ్యశ్రీలో రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం



వి.కొత్తూరులో మహిళకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న దృశ్యం

తుని రూరల్: వైద్య ఖర్చులు భరించలేక ఏ ఒక్కరూ ఇబ్బందులు పడరాదన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచారని వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరులో ఎంపీడీఓ పి.రవికుమార్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్య శిబిరాన్ని, ఉచిత మందులు, కొత్తగా జారీ చేసిన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నా, రూ.25 లక్షలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దుంగల నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఎంపీటీసీ కిల్లి సన్యాసిరావు, చిటికెల వరహాలబాబు, డాక్టర్ మహేశ్వరరావు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం డైరీ ఆవిష్కరణ

జగ్గంపేట: పెన్షనర్ల సంఘం జగ్గంపేట శాఖ డైరీని మంగళవారం జగ్గంపేట ట్రెజరీ ఆఫీసర్ జహీరుద్దీన్, రాజమండ్రి నన్నయ యూనివర్సిటీ ఏఏఓ కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. స్థానిక పెన్షనర్ల సంఘ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘ అధ్యక్షుడు చంద్రమౌళి వెంకటశాస్త్రి, ప్రతినిధులు తోలేటి సూర్యనారాయణ, మంచాల మల్లేశ్వరరావు, జోషి పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు సెబ్ అధికారులు మంగళవారం సారా బట్టీలపై దాడులు జరిపి, ముగ్గురిని అరెస్టు చేశారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లో దాడులు చేసినట్టు సెబ్ సీఐ పి.అశోక్ తెలిపారు. పెద్దిపాలెం గ్రామ శివారులో సారా బట్టీలపై దాడి చేసి, 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పరారైన దేవర రాంబాబుపై కేసు నమోదు చేశారు. సి రాయవరం సమీపంలో బైక్‌పై సారా తరలిస్తూ, పాలబోయిన రమణ పరారయ్యాడు. సెబ్ సిబ్బంది బైక్, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. వేలంకలో ఇద్దరు మహిళలను 20 లీటర్ల సారాతో అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా సెబ్ ఇంటెలిజెన్స్ సీఐ కె.గిరిధర్, ప్రత్తిపాడు సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.